సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 29 । జూలై । 2024



కేంద్ర బడ్జెట్‌పై సిటు నిరసన

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా జగదాంబ జంక్షన్‌లో సిటు ఆధ్వర్యంలో నిరసన జరిగింది. 8లో



ఆనందాల తీరం

సందర్శకులతో ఆదివారం జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు కిటకిటలాడాయి. ముఖ్యంగా బీచ్‌లు సందడిగా మారాయి. 8లో



కృషి, పట్టుదలతో విజయం తథ్యం

కృషి, పట్టుదలతో విజయం తప్పకుండా వరిస్తుందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఆడారి శ్యాంప్రసాద్ అన్నారు. 8లో

న్యూస్‌రీల్

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు



తాటిచెట్లపాలెం : భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణం కారణంగా కేకే లైన్ ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు రోజు ఉదయం విశాఖపట్నంలో బయల్దేరే విశాఖపట్నం–కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 29 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు రోజు కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్–విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు రోజు రాత్రి విశాఖపట్నంలో బయల్దేరే విశాఖపట్నం–కిరండూల్(18514) ఎక్స్‌ప్రెస్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 29 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు రోజు కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్– విశాఖపట్నం (18513) ఎక్స్‌ప్రెస్ దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

అప్పన్నను దర్శించుకున్న నేవీ వైస్ అడ్మిరల్ జనరల్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న స్వామినాథన్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం నేవీ వైస్ అడ్మిరల్ జనరల్ న్యూఢిల్లీ కె.స్వామినాథన్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరపూజ నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమార్చన నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, శేష వస్త్రాన్ని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేశారు.

రేపు నగరానికి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం మంగళవారం విశాఖ నగరానికి రానున్నారని మంగళగిరిలోని కమిషన్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. ఉదయం 11 గంటలకు కేజీహెచ్ ఎథిక్స్ గ్యాలరీలో అనధికార దత్తతలు, చట్ట ప్రకార చర్యలపై గైనకాలజీ, చిన్న పిల్లల వార్డుల వైద్యులు, నర్సింగ్, సెక్యూరిటీ, పారా మెడికల్ సిబ్బందితో జరిగే అవగాహన కార్యక్రమంలో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా కాలేజీ సెమినార్ హాల్లో జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ ఇంటర్మీడియట్ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లతో మాదక ద్రవ్యాల నియంత్రణలో ప్రభుత్వ అధికారుల సమన్వయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. తరువాత నగరంలోని పలు ప్రైవేటు స్కూళ్లు, కాలేజీలను తనిఖీ చేసే అవకాశం ఉంది. అనంతరం రోడ్డు మార్గాన కమిటీ సభ్యులు మంగళగిరికి వెళ్లనున్నట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలను సహించేది లేదు

అర్ధరాత్రి బీచ్ రోడ్డులో సీపీ పర్యటన

విశాఖ సిటీ: నగర పర్యాటకానికి కేంద్రంగా ఉన్న బీచ్ రోడ్డులో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు చేపట్టినా ఉపేక్షించేది లేదని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు. శనివారం అర్ధరాత్రి ఆయన బీచ్ రోడ్డులో కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి వరకు పర్యటించి అక్కడ పరిస్థితులను పరిశీలించారు. బీచ్ రోడ్డులో పలు ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులపై సీపీ ఇచ్చిన 7995095799 నెంబర్‌కు ఫిర్యాదులు రావడంతో స్వయంగా పోలీసింగ్ చేస్తూ తనిఖీ చేశారు. పోలీసుల గస్తీ నిర్వహిస్తున్న తీరుతో పాటు, డ్రంక్ అండ్ డ్రైవ్, రేసింగ్, ర్యాష్ డ్రైవింగ్, బహిరంగ మద్యపానం, ఇతర అల్లరి మూకల చర్యల వాస్తవ పరిస్థితులను గమనించారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన, పోలీసులు పట్టించుకోకపోయినా, లంచం అడిగినా.. తీసుకున్నా, ఎటువంటి సమస్యలు ఉన్నా తన నెంబర్‌కు తెలియజేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంటాయని తెలిపారు.

• కాలేయ వ్యాధులపై జాగ్రత్త



ప్రపంచ హెపటైటిస్ డే సందర్భంగా ఆర్కే బీచ్‌లోని కాళీమాత ఆలయం వద్ద జెండా ఊపి అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు 8లో


• రూపంలో రాజసం.. ఉట్టిపడే గాంభీర్యం





రూపంలో రాజసం.. ఒళ్లంతా పౌరుషం.. ఉట్టిపడే గాంభీర్యం.. పొగరుకు మారుపేరు.. అదే మన జాతీయ జంతువు పులి. కొన్నాళ్లగా పులుల సంతతి పెరుగుతుండడం ఆసక్తి రేకెత్తిస్తోంది. దేశంలో ప్రస్తుతం 3,682, రాష్ట్రంలో 75 పులులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మన జూ పార్కులో 7 పులులు అలరిస్తున్నాయి. నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం. ఈ సందర్భంగా ఆదివారం జూ పార్కులో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 8లో

స్టాండింగ్ కమిటీ సీటు రూ.20 లక్షలు!



- టీడీపీ ఎమ్మెల్యేల వేలం?
- స్థాయీ కమిటీ ఎన్నికల్లో ఎమ్మెల్యేల పెత్తనంపై కార్పొరేటర్ల ఆగ్రహం
- సమావేశం నుంచి అర్ధాంతరంగా వెళ్లిపోయిన సీనియర్ కార్పొరేటర్లు
- మరోసారి సమావేశానికి ఆహ్వానించినా డుమ్మా
- చెరో రెండు సీట్లు కేటాయించాలని బీజేపీ, జనసేన డిమాండ్
- నామినేషన్ల స్వీకరణకు రేపటి వరకు గడువు

'టీడీపీ కార్పొరేటర్లు.. రండి బాబు.. రండి.. ఆలోచించిన ఆశాభంగం.. మంచి తరుణం వచ్చింది. వేలం పాటలో పాల్గొండి.. స్టాండింగ్ కమిటీ సీటు పొందండి.. మా పాట రూ.20 లక్షలు.. ఎవరు ఎంత ఎక్కువగా పాడితే.. వారికే సీటు..'
జీవీఎంసీ చరిత్రలో తొలిసారిగా స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో సీటు పొందేందుకు వేలం పాట తరహాలో కొత్త ఒరవడికి తెరతీశారు టీడీపీ ఎమ్మెల్యేలు.

సాక్షి, విశాఖపట్నం : మహా విశాఖ నగర పాలక సంస్థ స్థాయీ సంఘం ఎన్నికలు కూటమిలో కొత్త పంచాయితీని తెచ్చి పెట్టాయి. ఇటీవల కొందరు కార్పొరేటర్లు టీడీపీ, జనసేన వైపు మొగ్గు చూపడంతో తమకు బలం పెరిగిందని భావిస్తూ స్టాండింగ్ కమిటీలో పాగా వేసేందుకు ఎత్తుగడలు ప్రారంభించాయి. దీనిపై టీడీపీలో 'వేలం' కుంపటి రగులుతుంటే.. తమ సీట్ల సంగతేంటంటూ జనసేన, బీజేపీ కార్పొరేటర్లు డిమాండ్ చేస్తుండటంతో కూటమిలో కుమ్ములాట మొదలైంది. రెండు రోజుల క్రితం జగదాంబ జంక్షన్‌లోని ఓ హోటల్‌లో స్థానిక టీడీపీ ఎమ్మెల్యేలు, పార్టీకి చెందిన కార్పొరేటర్లు సమావేశమయ్యారు. స్టాండింగ్ కమిటీ సీటు నియోజకవర్గాల వారీగా ఎవరికి ఇవ్వాలో తామే నిర్ణయిస్తామని ఎమ్మెల్యేలు చెప్పినట్లు తెలుస్తోంది. రూ.20 లక్షల కంటే ఎక్కువ ఎవరు ఇస్తారో వారికే సీటు ఇస్తామనే ప్రతిపాదన కార్పొరేటర్ల ముందు ఉంచినట్లు సమాచారం. ఇందుకు కొందరు కార్పొరేటర్లు అంగీకరించి ముందుకు రాగా పార్టీలో మొదటి నుంచి ఉన్న కార్పొరేటర్లు మాత్రం తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేల వైఖరిపై వీరు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

కార్పొరేషన్ ఎన్నికల్లో ఎవరైనా సహకరించారా.?

పూర్తిగా కార్పొరేటర్ల మధ్య జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేల పెత్తనాన్ని సీనియర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో ఏ ఎమ్మెల్యే అయినా ఒక్క కార్పొరేటర్‌ను గెలిపించారా.? ఎన్నికల సమయంలో ఎవరైనా ముందుకొచ్చి నిలబడ్డారా.? ఈ ఎమ్మెల్యేలంతా అప్పుడే సహకరించి ఉంటే మరిన్ని కార్పొరేటర్ల స్థానాల్ని కైవసం చేసుకునేవాళ్లమనీ.. అప్పుడు కనిపించని వీరు ఇప్పుడు వేలం పాట తరహాలో సీట్లు కేటాయించడమేంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు సీనియర్ కార్పొరేటర్లు.. ఎమ్మెల్యేలు వారిస్తున్నా వినకుండా సమావేశం నుంచి బయటకు వచ్చేసినట్లు తెలుస్తోంది. ఆదివారం కొందరు ఎమ్మెల్యేలు సమావేశమై మరోసారి కార్పొరేటర్లను పిలిచినా చాలామంది డుమ్మా కొట్టినట్లు సమాచారం. కొత్తగా పార్టీలో చేరిన కార్పొరేటర్లకు సీట్లు ఇచ్చేందుకు ముందుగానే బేరసారాలు కుదుర్చుకొని.. ఇప్పుడీ తరహాలో వ్యవహరిస్తున్నారనే అనుమానాల్ని కొందరు టీడీపీ కార్పొరేటర్లు వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్నవారిని పక్కన పెట్టి ఎమ్మెల్యేలు చేస్తున్న వ్యవహారంపై రగిలిపోతున్నారు.

ఆ రెండు పార్టీలు చెరో రెండు డిమాండ్

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ఈ నెల 22న నోటిఫికేషన్ జారీ చేయగా ఈనెల 30వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరించనున్నారు. 31న స్క్రూటీ్ని నిర్వహించి తుది జాబితా ప్రకటిస్తారు. ఆగస్ట్ 7న ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్లు వేసేందుకు ఆఖరి గడువు సమీపించడంతో కూటమిలో కుయుక్తులు మొదలయ్యాయి. తమకు చెరో రెండు కేటాయించాలని జనసేన, బీజేపీ డిమాండ్ చేస్తుంటే.. సింహభాగం తమ వద్దే ఉంచుకొని ఈ రెండు పార్టీలకు చెరొకటి కేటాయించాలని టీడీపీ భావిస్తోంది. సీట్ల కేటాయింపుపై మూడు పార్టీల ఎమ్మెల్యేలు సోమవారం సమావేశమై తుది జాబితా ప్రకటించనున్నట్లు సమాచారం. జనసేన కార్పొరేటర్లు మాత్రం పట్టు వీడకూడదని భావిస్తుండగా తక్కువ బలం ఉన్న బీజేపీ మాత్రం సర్దుకుపోవాలని నిర్ణయించినట్లు సమాచారం.

ధీమాగా వైఎస్సార్‌సీపీ..

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో మరోసారి విజయ దుందుభి మోగిస్తామని వైఎస్సార్ సీపీ ధీమా వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే పార్టీ తరఫున 12 మందితో కూడిన జాబితాను మేయర్ గొలగాని హరివెంకటకుమారి, పార్టీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు అధిష్టానానికి అందించారు. వీరిలో ఎంపిక చేసిన 10 మంది జాబితాను సోమవారం విడుదల చేసి నామినేషన్లు వేయించేందుకు సిద్ధమవుతున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎన్నికల్లో పది మంది సభ్యులను కార్పొరేటర్లు ఎన్నుకోనున్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి కొందరు కార్పొరేటర్లు వెళ్లిపోయినా తమకు ఎలాంటి నష్టం లేదని ఆ పార్టీ ధీమాతో ఉంది. మరోసారి స్టాండింగ్ కమిటీ మొత్తాన్ని సొంతం చేసుకునేందుకు మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్లు కటుమూరి సతీష్, జియ్యాని శ్రీధర్ తీవ్రంగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

క్యాన్సర్ వైద్య సేవలు విస్తృతం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: క్యాన్సర్ వైద్య సేవలు ప్రతి రోగికి అందించేందుకు వైద్యులు కృషి చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ కోరారు. విశాఖలోని ఆంధ్ర వైద్య కళాశాల(ఏఎంసీ) ఆడిటోరియంలో రెండో రోజు ఆదివారం జరిగిన నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ ఏపీ చాప్టర్ రెండో వార్షిక సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. క్యాన్సర్ విస్తరణను ముందు జాగ్రత్తతో అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రజల జీవన విధానంలో జరుగుతున్న మార్పుల వల్ల క్యాన్సర్ బాధితులు రోజురోజుకు పెరుగుతున్నారని చెప్పారు. నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ ఏర్పాటుతో క్యాన్సర్ చికిత్సలో అధునాతన వైద్య పద్ధతులపై చర్చించినట్టు చెప్పారు. బాధితులకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించి వారి జీవన ప్రమాణాలను పెంచాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉందన్నారు. కేజీహెచ్‌లో హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి సహకారంతో నిర్వహిస్తున్న క్యాన్సర్ వైద్య సేవలకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు జిల్లా యంత్రాంగం తరఫున అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఉమేశ్ మహంత్ శెట్టి, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, క్యాన్సర్ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్ప, పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు పాల్గొన్నారు.

చెత్తమయం.. స్వచ్ఛత మాయం



- నగరంలో ఎక్కడికక్కడే పేరుకుపోతున్న చెత్త
- స్వచ్ఛసర్వేక్షణ్ లక్ష్యానికి దూరమవుతున్న జీవీఎంసీ
- ప్రచారార్భాటానికి రూ.కోట్లు ఖర్చు
- పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించని వైనం



వెలంపేటలో ఇదీ పారిశుధ్యం పరిస్థితి

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకుల వివరాలు

2019లో – 23
2020లో – 9
2021లో – 9
2022లో – 4
2023లో – 4

సాక్షి, విశాఖపట్నం : ఈ ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అనుకున్న లక్ష్యం వైపు నగరం వెళ్తోందా..? జీవీఎంసీ చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలిస్తాయా.? ప్రస్తుత పరిస్థితులు చూస్తే.. లక్ష్యానికి దూరంగానే ఉందని స్పష్టమవుతోంది. నగరం చెత్తమయంగా మారిపోయింది. ఎటు చూసినా చెత్త కుప్పలు, కాలువల్లో పేరుకుపోయిన మురుగు నీరే దర్శనమిస్తోంది. సామాజిక మాధ్యమాల్లో కోట్ల రూపాయలతో ప్రచార ఆర్భాటమే తప్ప.. పరిశుభ్రతపై జీవీఎంసీ అధికారులు దృష్టి సారించడం లేదు. పారిశుధ్య నిర్వహణ తమకేమాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో స్వచ్ఛతలో నగరం నీరసిస్తున్నట్లు కనిపిస్తోంది.

దేశ వ్యాప్తంగా ఆయా నగరాలకు కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు ప్రదానం చేస్తోంది. నగరాల్లో ఉండే మౌలిక సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణ, బహిరంగ మలమూత్ర విసర్జన నిర్మూలన, ఇళ్లల్లో మరుగుదొడ్ల నిర్మాణం, రవాణా వ్యవస్థ, చెత్తశుద్ధి నిర్వహణ మొదలైన అంశాలను పరిగణనలోకి తీసుకొని ఈ అవార్డులకు నగరాలను ఎంపిక చేస్తోంది. 2018–2019లో 23వ స్థానానికి దిగజారి ఉన్న నగరాన్ని 2019–20 నుంచి పైపైకి తీసుకొచ్చారు. 2020, 2021లో 9వ స్థానంలో ఉండగా.. 2022, 2023లో 4వ స్థానానికి ఎగబాకిన నగరం.. దేశంలోనే టాప్–5 నగరాల సరసన చేరింది. ప్రస్తుత పరిస్థితులు చూస్తే ఈసారి టాప్–10లో కూడా కష్టంగా కనిపిస్తోంది.

అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ

నగరంలో ఎటుచూసినా పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా కనిపిస్తోంది. ప్రతి రోజూ ఇంటింటికీ వెళ్లి చెత్తని సేకరించడంతో పాటు డంపర్ బిన్లలోని చెత్తను కూడా తరలించాలి. అయితే.. ప్రధాన జంక్షన్లు మినహా మిగిలిన ప్రాంతాలవైపు కనీసం దృష్టి సారించడం లేదు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తీయడం లేదు. ప్రజారోగ్య విభాగాధికారులు ఆకస్మిక తనిఖీలు కూడా గాలికొదిలేశారు. దీంతో మహా విశాఖ నగరంలో ఎటు చూసినా చెత్త కుప్పలే సాక్షాత్కరిస్తున్నాయి.

ప్రచారంపైనే దృష్టి

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచండి.. అంటూ సామాజిక మాధ్యమాల్లో మాత్రం జీవీఎంసీ అధికారులు ఊదరగొడుతున్నారు. ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, వాట్సప్‌లలో ప్రచారం కోసం కోట్ల రూపాయిలు ఖర్చు చేసేస్తున్నారు. ఈ తరహా యాడ్స్, కరపత్రాలు, వీడియోల తయారీ.. మొదలైన కాంట్రాక్టును స్వచ్ఛ సర్వేక్షణ్ మొదలైనప్పటి నుంచి రెండు సంస్థలకే అప్పగిస్తున్నారు. దీని వెనుక ఓ ఉన్నతాధికారితో పాటు జూనియర్ అసిస్టెంట్ హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమకు లాభాలు తీసుకొస్తున్న సంస్థలకు ప్రచార వ్యవహారాలు అప్పగించి.. పబ్బం గడిపేసుకుంటున్నారు తప్ప.. క్షేత్రస్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ కోసం ఏ విధంగా కృషి చేస్తున్నామన్న కనీస చిత్తశుద్ధి అధికారుల్లో కనిపించడం లేదు. దీంతో గత నెల రోజులుగా పారిశుధ్య నిర్వహణ ఎక్కడా సక్రమంగా కనిపించం లేదు.

జీవీఎంసీ మొత్తం విస్తీర్ణం	695 చ.కి.మీ
మొత్తం జనాభా	22.50 లక్షలు
రోజూ ఉత్పత్తవుతున్న చెత్త	1100 మెట్రిక్ టన్నులు
క్లాప్ వాహనాలు	600
వివిధ విభాగాల పారిశుధ్య సిబ్బంది	5,838

'క్లాప్' కొట్టడం లేదా.?

క్లీన్ ఆంధ్రప్రదేశ్ పేరుతో క్లాప్ వాహనాల్ని చెత్త తరలింపునకు వినియోగించారు. గత నెల రోజులుగా వీటి పనితీరు కూడా మరుగున పడిపోయింది. చాలా ప్రాంతాలకు క్లాప్ వాహనాలు ప్రతి రోజూ రావడం లేదని తెలుస్తోంది. 100 శాతం డోర్ టు డోర్ కలెక్షన్ జరగడం లేదు. తడి, పొడి చెత్త వేరు చేయడంలోనూ వెనుకపడిపోయింది. కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల నుంచి,, దుకాణాల నుంచి తడి పొడి చెత్త వేరుగా ఇస్తున్నా.. క్లాప్ సిబ్బంది రెండు కలిపేసి వాహనంలో పడేస్తున్నారు. దీంతో స్వచ్ఛ సర్వేక్షణ్‌కు తూట్లు పొడుస్తున్నారు. ఇలా ప్రతి అంశంలోనూ నగరం స్వచ్ఛతకు రోజు రోజుకూ దూరమైపోతోంది.



పూర్ణామార్కెట్‌లో రోడ్ల పక్కన వ్యర్థాలు

సాహితీ విశ్వరూపం రావిశాస్త్రి

- రచయిత వృద్ధుల కల్యాణ రామారావు
- ఘనంగా రాచకొండ విశ్వనాథ శాస్త్రి జయంతి



రావిశాస్త్రి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కథా రచయితలు, సాహితీవేత్తలు

సీతంపేట: రాచకొండ విశ్వనాథ శాస్త్రి సాహితీ విశ్వరూపమని రచయిత, న్యాయవాది వృద్ధుల కల్యాణ రామారావు అన్నారు. ఉదయిని సాహితీ సంస్థ ఆధ్వర్యంలో రాచకొండ విశ్వనాథ శాస్త్రి 102వ జయంతి సభ ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని ఎలా అర్థం చేసుకోవాలో రావిశాస్త్రి సాహిత్యం వల్లనే తెలిసిందన్నారు. రావిశాస్త్రి పరిచయంతో వాస్తవ సమాజం చూశానని, ఆయన రచనలు చదువుతూ ఉంటే ఆత్మీయత కనిపిస్తుందన్నారు. రావిశాస్త్రి రచనల్లో తనకు నచ్చిన జరీ అంచు, విలువలు, మాయ కథ ఆయనకు కూడా బాగా ఇష్టమని పేర్కొన్నారు. రావిశాస్త్రి రచనల్లో చాలా వరకు కోర్టు వాతావరణంతో ముడిపడి ఉంటాయని, క్రిమినల్, పోలీస్, లాయర్, మెజిస్ట్రేట్ అయితే బాగా అర్థమవుతాయన్నారు. కథారచయిత వాడ్రేవు చిన వీరభద్రుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర మాండలికానికి శాస్త్రి తన రచనలతో విశ్వవ్యాప్త గుర్తింపు తెచ్చారని కొనియాడారు. రావిశాస్త్రి కుమారుడు ఉమాకుమార శాస్త్రి మాట్లాడుతూ తాను న్యాయవాదిని అయ్యాకే తండ్రి రచనల విలువ తెలిసిందన్నారు. రచనల్లో చెప్పినట్టే ఆయన తన జీవితాన్ని నిరాడంబరంగా గడిపారని గుర్తు చేశారు. ప్రముఖ విమర్శకులు వర్మ మాట్లాడుతూ సమాజంలో పాతుకుపోయిన భావజాలంలోని లోపాలను రావిశాస్త్రి తన రచనల ద్వారా ఎత్తి చూపారని తెలిపారు. సభాధ్యక్షులు కుమార్ కూనపరాజు మాట్లాడుతూ శాస్త్రి రచనలు 60–70 ఏళ్ల మధ్య రాసినవి అయినప్పటికీ నేటి ఆధునిక యుగంలో సాహిత్యానికి దగ్గరగా ఉంటాయన్నారు. ప్రజా కవి దేవిశ్రీ రావిశాస్త్రిపై పాడిన పాట అందరినీ ఆకట్టుకుంది. అనంతరం రావిశాస్త్రి సాహితీ పురస్కారాలను యువ రచయితలు సురేంద్ర శీలం, శ్రీఊహ, మల్లిపురం జగదీష్‌లకు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, రచయితలు కె.మల్లీశ్వరి, వై.వేణుగోపాల్ రెడ్డి, తాడి ప్రకాష్, జి.ఎస్.చలం తదితరులు పాల్గొన్నారు.

నేడు జీవీఎంసీలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి ఈ కార్యక్రమం ఉంటుందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

కాలేయ వ్యాధులపై జాగ్రత్త

- కలెక్టర్ హరేందిర ప్రసాద్


ర్యాలీ చేస్తున్న వైద్యులు, వైద్య విద్యార్థులు

మహారాణిపేట: కాలేయ వ్యాధి పట్ల ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని.. ఆరోగ్యకరమైన జీవన శైలి ద్వారా ఈ వ్యాధిని అదుపులో ఉంచవచ్చని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అన్నారు. ప్రపంచ హెపటైటిస్ డే సందర్భంగా ఆర్కే బీచ్‌లోని కాళీమాత ఆలయం వద్ద ఆంధ్రా మెడికల్ కళాశాల, కేజీహెచ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, మైక్రోబయాలజీ విభాగాల ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన ర్యాలీ, వైద్య శిబిరం జరిగింది. కాళీమాత ఆలయం నుంచి పోలీసు అమరవీరుల స్థూపం వరకు సాగిన ర్యాలీలో పలు వైద్య విభాగాధిపతులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెపటైటిస్ బి, సి వంటి కాలేయ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. క్రమంగా హెపటైటిస్ బి, సి వ్యాధుల ప్రమాదం పెరుగుతోందని, దీనిని నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుందని హెచ్చరించారు. పిల్లలు పుట్టిన 24 గంటల్లోపు లలో హెపటైటిస్ బీ వ్యాక్సిన్ తప్పకుండా వేయించాలని సూచించారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మాట్లాడుతూ హెపటైటిస్ బి, సి వ్యాధులకు గురైన వారికి ప్రత్యేకంగా కేజీహెచ్‌లో ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.అనంతరం కలెక్టర్ ఉచిత కాలేయ పరీక్షల వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ సీనియర్ వైద్యుడు పెద వీర్రాజు, కేజీహెచ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎల్ఆర్ఎస్ గిరినాథ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్, ఏఎంసీ విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్, కేజీహెచ్ మేనేజర్ జె.ఎం.జవహర్, పలువురు వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై నిరసన

డాబాగార్డెన్స్: గ్రామీణ పేదలు, కార్మికులకు ద్రోహం చేసేలా కేంద్ర బీజేపీ బడ్జెట్ ఉందని సిటు విశాఖ జిల్లా కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.నాయనబాబు తీవ్రంగా పేర్కొన్నారు. బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఆదివారం జగదాంబ జంక్షన్లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయానికి, గ్రామీణ ప్రాంతాలకు మోదీ ప్రభుత్వం మరోసారి అన్యాయం చేసిందన్నారు. గత బడ్జెట్ కంటే ఈ బడ్జెట్‌తో కోత విధించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. వికసిత్ భారత్ అంటే పేదలకిచ్చే రాయితీలు, బడ్జెట్ కోత విధించి కార్పొరేట్ సంస్థలకు రాయితీలు కల్పించడం కాదని మోదీ ప్రభుత్వానికి చురకలంటించారు. 2024 సాధారణ ఎన్నికల్లో రైతులు, గ్రామీణ పేదలు, కార్మికులు బుద్ధి చెప్పినప్పటికీ మోదీ ప్రభుత్వంలో చలనం లేకపోవడం సరైంది కాదన్నారు. బీజేపీ యేతర రాష్ట్రాలకే కాకుండా ఎన్డీఏ కూటమిలో గల రాష్ట్రాలకు సైతం తీవ్ర కోతలు విధించారన్నారు. కార్మికులకు నష్టదాయకమైన 4 లేబర్ కోడ్స్ రద్దు చేసి పాత కార్మికచట్టాలు యథావిధిగా అమలు చేయాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తున్నట్టు ప్రకటన చేయాలని, సొంతగనులతో పాటు వర్కింగ్ క్యాపిటల్‌కు రూ.5వేల కోట్లు తక్షణ సాయంగా అందజేయాలన్నారు. కార్యక్రమంలో సిటూ అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, రాజు, సీతాలక్ష్మి, పి.మణి, చంద్రశేఖర్, పి.వెంకట్రావు, ఒమ్మి అప్పారావు, చంద్రమౌళి, నరేంద్రకుమార్, దేముడునాయుడు, గనిశెట్టి సత్యనారాయణ, ఎం.రాంబాబు, పైడిరాజు, ఆర్ లక్ష్మణమూర్తి, కొండమ్మ, భారతి, శంకరరావు, బాబూరావు పాల్గొన్నారు.

మైనర్ కిడ్నాప్ ఘటనపై కేసు నమోదు

ఎంవీపీకాలనీ: పెదవాల్తేర్‌కు చెందిన మైనర్‌ను కిడ్నాప్ చేసిన ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన శోభనాపురపు యువరాజు నగరంలోని సుజాతనగర్‌లో ఓ టైల్స్ దుకాణంలో పని చేస్తున్నాడు. పెదవాల్తేర్‌కు చెందిన ఓ మైనర్‌తో సోషల్ మీడియాలో పరిచయం ఏర్పడింది. దీంతో ప్రేమ పేరుతో ఆ బాలికను యువరాజు వలలో వేసుకున్నాడు. అతని మాటలు నమ్మిన మైనర్ ఇటీవల బయటకు వెళ్లివస్తానని తల్లిదండ్రులకు చెప్పి ప్రేమించిన యువకుడితో వెళ్లిపోయింది. ఈ విషయం తెలియని తల్లిదండ్రులు బాలిక కోసం విస్తృతంగా గాలించగా ఎక్కడా ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం వారు ఎంవీపీ పోలీసులను ఆశ్రయించారు. వారి విచారణలో యువరాజు ఆ బాలికను తీసుకుపోయినట్లు తెలిసింది. దీంతో యువరాజుపై కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూపంలో రాజసం.. ఉట్టిపడే గాంభీర్యం

రూపంలో రాజసం.. నడకలో గాంభీర్యం.. వేగం .. ఇలా ఎన్నో లక్షణాలతో పులి మన జాతీయ జంతువైంది. ఒకప్పుడు వందల్లో కనిపించే పులుల సంఖ్య తర్వాత క్రమంగా తగ్గిపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన చర్యలతో కొన్నేళ్లుగా ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. పెద్ద సంఖ్యలో పులుల సంతతి పెరుగుతుండడం ఆసక్తి రేకెత్తిస్తోంది. పులులు ఉన్న అడవుల్లో వృక్ష సంపద, పచ్చదనం, వివిధ రకాల వన్యప్రాణులతో వాతావరణం సమతుల్యంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం. ఇందిరాగాంధీ జూ పార్కులో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

- రాష్ట్రంలో పెరుగుతున్న పులుల సంతతి
- మన జూ పార్కులో ఏడు టైగర్లు
- నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం


జూలోని ఎన్‌క్లోజర్‌లో పెద్ద పులి

ఆరిలోవ: అరణ్యంలో వన్యప్రాణులు సమపాళ్లలో ఉంటే మానవాళి మనుగడకు మేలు జరుగుతుంది. పర్యావరణంలో ఉన్న ఏ వన్యప్రాణి జాతి తగ్గినా సమతుల్యతకు భంగం కలుగుతుంది. మానవ చర్యలతో పులుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో పర్యావరణ శాస్త్రవేత్తల్లో ఆందోళన నెలకొంది. దీంతో పులుల సంతతి పెరిగేందుకు, వాటి అవసరంపై ప్రపంచ వ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కల్పించడానికి పర్యావరణవేత్తలు 1972లో దృష్టి సారించారు. అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా పులుల వేటను నిషేధించారు. 2010 నుంచి ఏటా జూలై 29న అంతర్జాతీయ పులులు దినోత్సవం నిర్వహిస్తున్నారు.

పెరుగుతున్న పులుల సంఖ్య

భారతదేశంలో పులుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ప్రస్తుతం దేశంలో వివిధ రాష్ట్రాల అడవుల్లో 3,682 పులులు ఉన్నట్లు అటవీశాఖ అధికారులు లెక్కకట్టారు. 2006లో దేశంలోని వివిధ రాష్ట్రాల అడవుల్లో 1,411 పెద్ద పులులు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. 2010లో 1,726, 2014లో 2,226, 2018లో 2,967 కాగా 2023(2022లో లెక్కింపు జరగలేదు)లో వాటి సంఖ్య 3,682కి పెరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, మధ్యప్రదేశ్, జార్ఖండ్, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని అడవుల్లో పులులు ఎక్కువగా సంచరిస్తున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

రాష్ట్రంలో 75 పులులు

మన రాష్ట్రంలో 75 పులులు ఉన్నాయి. నాగార్జునసాగర్ టైగర్ రిజర్వ్‌లో 64, శేషాచలం అడవుల్లో 9, పాపికొండలులో రెండు పులులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. శ్రీశైలం, ఆత్మకూరు, మర్కాపూర్‌లలో పులుల సంరక్షణ కేంద్రాలున్నాయి. 2014లో వీటి సంఖ్య 40 కాగా.. 2023 లెక్కల ప్రకారం వీటి సంఖ్య 75కు పెరిగింది.

పులులను ఎలా లెక్కిస్తారంటే..

నేషనల్ టైగర్స్ కన్జర్వేషన్ అథారిటీ(ఎన్‌టీసీఏ) ఆధ్వర్యంలో ప్రతి నాలుగేళ్లకోసారి అటవీశాఖ అధికారులు పులుల సంఖ్యను లెక్కిస్తారు. అరణ్యాల్లో అవి నడిచే జాడ కనుక్కొంటారు. అధికార బృందాలు వాటి అడుగులను బట్టి లెక్కిస్తారు. అలాగే అడవుల్లో అవి సంచరించే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తారు. వాటిలో నమోదైన వాటిని గుర్తిస్తారు.

ఏకాంతంగా పులుల సంచారం

అడవుల్లో పులులు ఒంటరిగానే సంచరిస్తాయి. జింకలు, కనుజులు, ఏనుగులు మాదిరిగా గుంపులుగా తిరగవు. గుంపులుగా తిరిగే జింకల జాడ కనిపెట్టి ఓ చెట్టు చాటున, లేదంటే దట్టమైన పొదల చాటున మాటు వేస్తాయి. జింకలు దగ్గరకు రాగానే ఒక్కసారిగా వాటిపై దూకి ఒక దాన్ని పట్టుకుని ఆహారంగా తీసుకుంటాయి. ఇవి అడవుల్లో 12 నుంచి 16 ఏళ్లు జీవిస్తాయి. వీటిలో 3 నుంచి 4 ఏళ్ల వయసులో సంతానోత్పత్తి దశ ప్రారంభమవుతుంది. బ్రీడింగ్ సమయంలో మాత్రమే ఆడ, మగ పులులు కలసి తిరుగుతాయి. ఆడ పులి గర్భం దాల్చిన అనంతరం మగ పులి వేరే చోటకు వెళ్లిపోతుంది. అప్పటి నుంచి ఆడ పులి ఒంటరిగా ఉంటూ 110 రోజుల గర్భావధి అనంతరం కూనలకు జన్మనిస్తుంది. ఒక తడవలో ఒకటి నుంచి 5 వరకు కంటుంది. కూనలు జన్మించిన తర్వాత రెండేళ్లు తల్లి సంరక్షణలోనే ఉంటాయి. ఈ రెండేళ్లలో ఆ కూనలు ఆహారం సంపాదన నేర్చుకుంటాయి. అనంతరం తల్లే వాటిని తరిమేస్తుంది. అప్పటి నుంచి అవి వేర్వేరుగా జీవిస్తాయి.

దొరికినంత వరకు వెంబడిస్తాయి

పులులు జింక, కనుజు, అడవిదున్న, అడవి పంది, ముళ్ల పంది తదితర వాటిని తింటాయి. అవి వాటి పంజాకు దొరికినంత వరకు వెంబడిస్తాయి. గంటకు 60 కిలో మీటర్ల వేగంతో పరుగెత్తి వాటిని పట్టుకుంటాయి. పులి ఒక జంతువును చంపిన అనంతరం రెండు, మూడు రోజుల పాటు అదే ప్రాంతంలో తిరుగుతూ దాన్ని తింటుంది. తర్వాత వారం రోజుల వరకు ఆహారం లేకుండా ఉండగలదు. నీరు మాత్రం ఎక్కువగా తాగుతుంది. ఆహారం కోసం మగవి 20 నుంచి 25 కిమీ పరిధిలో, ఆడ పులులు 15 నుంచి 20 కిమీ పరిధిలో అడవుల్లో తిరుగుతుంటాయి. ఒక పులి తిరిగే పరిధిలో మరో పులి సంచరించదు. పులి తల నుంచి తోక వరకు సుమారు 10 అడుగుల పొడవు ఉంటుంది. దీని ఎత్తు 3 నుంచి మూడున్నర అడుగులు. ఆడ పులి 65 కిలోల నుంచి 170 కిలోలు, మగది 90 కిలోల నుంచి 310 కిలోల బరువు ఉంటుంది. ఆహారం కోసం వేటాడటం వల్ల వాటి ఆరోగ్యం క్రమేపీ క్షీణిస్తుందని అధికారులు చెబుతున్నారు.

ఇందిరాగాంధీ జూలో 7 పెద్ద పులులు

ఇందిరాగాంధీ జులాజికల్ పార్కులో 7 పెద్ద పులులున్నాయి. వీటిలో నాలుగు తెల్ల పులులు(రెండు జతలు) కాగా మరో మూడు ఎల్లో టైగర్స్(ఒకటి మగ, రెండు ఆడ). ఇవి ఆయా ఎన్‌క్లోజర్లలో సందర్శకులను అలరిస్తున్నాయి. ఇక్కడ జంతు సంరక్షకులు వీటికి సమయానికి ఆహారం, నీరు అందిస్తున్నారు. ఎన్‌క్లోజర్లలో వాటిని ఒక్కొక్కటిగా విడిచిపెడతారు. అన్నింటినీ ఒకేసారి విడిచిపెడితే పోట్లాడుకుని గాయాలు చేసుకుంటాయి.

పులులే అడవులకు రక్ష



పులులపై అందరూ అవగాహన కలిగి ఉండాలి. పులులు ఉన్న అడవుల్లో వృక్ష సంపద పుష్కలంగా ఉంటుంది. జింకలు, కనుజులు, అడవి పందులు ఎక్కడైతే గుంపులుగా తిరుగుతున్నాయో.. ఆయా ప్రాంతాల్లో పులులు ఉన్నట్లు భావిస్తాం. ఇవి అడవుల్లో 15 ఏళ్ల వరకు, జూ పార్కులో అయితే 25 ఏళ్లకు పైగా జీవిస్తాయి. ప్రతీ పూట ఆహారం, వైద్యం అందిస్తున్నాం. అందుకు ఎక్కువ కాలం జీవించడానికి ఇక్కడ అవకాశం ఉంటుంది. ప్రతీ నాలుగేళ్లకు చేపడుతున్న లెక్కల ప్రకారం పులులు సంఖ్య పెరుగుతోంది. పులులపై అవగాహన కల్పించడానికి ఆదివారం పాఠశాల నుంచి పీజీ వరకు విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించాం. సోమవారం జూలో పులులు దినోత్సవం నిర్వహిస్తాం.

– డాక్టర్ నందనీ సలారియా, జూ క్యూరేటర్

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు

ఆరిలోవ: అంతర్జాతీయ పులుల దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం జూ పార్కులో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు నగరంలో పలు పాఠశాలలు, కళాశాలల నుంచి 110 మంది ఒకటో తరగతి నుంచి పీజీ వరకు విద్యార్థులు హాజరయ్యారు. తరగతుల వారీగా పులులు, వాటి సంరక్షణ, పర్యావరణంలో వాటి అవసరం తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. వీటిలో ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి సోమవారం బహుమతులు అందజేస్తామని జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు.


చిత్రలేఖనం పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు


బొమ్మ గీస్తున్న విద్యార్థిని

జూలో సందడి


జూలో సైకిళ్లు తొక్కుతూ సందడి చేస్తున్న యువత


ఖడ్గమృగం మడుగు చుట్టూ పెయింటెడ్ స్టోర్క్స్


స్క్విరెల్ మంకీ

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కు ఆదివారం సందర్శకులతో సందడిగా మారింది. ఏనుగులు, తెల్లపులి తదితర జంతువులు, పక్షులు తమ ఎన్‌క్లోజర్లలో హుషారుగా తిరుగుతూ సందర్శకులను అలరించాయి. గుజరాత్ నుంచి తీసుకు వచ్చిన మీర్‌కాట్‌లు, స్క్విరెల్ మంకీస్ కొమ్మలు, కర్రలపై గెంతులు వేస్తూ కనువిందు చేశాయి. జూలో అద్దెకు ఇస్తున్న సైకిళ్లపై యువతులు కలియ తిరుగుతూ ఎంజాయ్ చేశారు. జూలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల రాకతో పండగ వాతావరణం నెలకొంది. వీరంతా వన్యప్రాణులను తిలకించి సరదాగా గడిపారు.


మీర్‌కాట్‌లను సెల్‌ఫోన్‌లో బంధిస్తున్న సందర్శకుడు

మద్యం దుకాణాల్లో కాలం చెల్లిన బీర్ల విక్రయం

- ఆ బీరు తాగిన వ్యక్తికి అస్వస్థత
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన


కాలం చెల్లిన బీర్లను కాలువలో ఒంపేస్తున్న ఎక్సైజ్ అధికారులు

పెదగంట్యాడ: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కాలం చెల్లిన బీర్ల విక్రయిస్తుండడం కలకలం రేపుతోంది. ఆ బీరు తాగిని వ్యక్తి అస్వస్థతకు గురి కావడంతో ఎక్సైజ్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఏపీ దుకాణాల్లో కాలం చెల్లిన బీర్లు ఉన్నాయో గుర్తించి వెంటనే వాటిని కాలువల్లో పారబోశారు. ఈ నెల 16న జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సిద్దేశ్వరంలో గల ప్రభుత్వ మద్యం దుకాణంలో అదే ప్రాంతానికి చెందిన నూకరాజు అనే వ్యక్తి ఈ నెల 16న బీరు కొనుగోలు చేశాడు. ఆ బీరు ఇంటి వద్దకు తీసుకెళ్లి తాగాడు. కాసేపటి తర్వాత అతను వాంతులు చేసుకున్నాడు. ఒక్కసారిగా వాంతులు ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. అతను తాగిన బీరు సీసాను పరిశీలించారు. అది కాలం చెల్లినది కావడంతో వారంతా మద్యం దుకాణం వద్దకు వచ్చి ఆందోళన చేశారు. దీంతో మద్యం దుకాణంలోని సిబ్బంది వెంటనే ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే ఎక్సైజ్ అధికారులు అక్కడకు చేరుకుని నూకరాజును ఆస్పత్రికి తరలించారు. ఆపై కాలం చెల్లిన బీర్లను గుర్తించి వాటిని సమీపంలోని కాలువలో ఒంపేశారు. అలాగే శ్రీనగర్‌లోని ఓ మద్యం దుకాణంలో ఉన్న బీర్లను కూడా కాలువలో పడేశారు.

ఆనందాల తీరం





బీచ్‌రోడ్డు: చాలా రోజుల తర్వాత వాతావరణం అనుకూలించడంతో సందర్శకులతో ఆదివారం జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు కిటకిటలాడాయి. ముఖ్యంగా సముద్ర తీర ప్రాంతాలు, బీచ్‌లు సందడిగా కనిపించాయి. ప్రకృతిని ఆస్వాదించేందుకు వచ్చిన ప్రజలు సముద్రంలో స్నానాలు చేసి.. సెల్ఫీలు తీసుకుంటూ సరదాగా గడిపారు. చిన్నారులు ఇసుకలో బొమ్మలు వేసి, కోటలు కట్టి ఆనందించారు. యువత స్నేహితులతో కలిసి సముద్రపు అలల్లో ఆడుకుంటూ సమయాన్ని గడిపారు. మహిళలు కబుర్లతో కాలక్షేపం చేశారు. బీచ్‌గార్డ్‌లు అప్రమత్తంగా వ్యవహరిస్తూ.. ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేశారు.

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

కృషి, పట్టుదలతో విజయం తథ్యం

- పార్వతీపురం మన్యం కలెక్టర్ ఆడారి శ్యాంప్రసాద్

సీతంపేట : నిరంతర కృషి, పట్టుదలతో విజయం తప్పకుండా వరిస్తుందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఆడారి శ్యాంప్రసాద్ అన్నారు. కేంద్ర గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గవర ఉత్తమ విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవ సభ ఆదివారం అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చి, తక్కువ మార్కులతోనే విద్యాభ్యాసం చేసి చిన్న ప్రభుత్వ ఉద్యోగంలో చేరానన్నారు. తర్వాత కష్టపడి కలెక్టర్ ఉద్యోగం సాధించానన్నారు. ఐఏఎస్ చదవాలనుకునే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు ఇస్తానని హామీ ఇచ్చారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ ప్రపంచంలో అన్ని చోట్ల అన్ని రంగాలలో నిష్ణాతులైన గవర జాతీయులు ఉండటం గర్వకారణమన్నారు. ప్రముఖ వైద్య నిపుణులు మల్ల భాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలన్నారు. కేంద్ర గౌరీ సంఘం అధ్యక్షులు బుద్ధ శివాజీ మాట్లాడుతూ 80 శాతం పైగా మార్కులు సాధించిన 800 మంది విద్యార్థులను సత్కరించామన్నారు. అలాగే పేద విద్యార్థులకు మొదటిసారిగా స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి సత్యవతమ్మ, బొడ్డేటి కాశీవిశ్వనాథ్, మళ్ల రామునాయుడు, సంఘం ప్రధాన కార్యదర్శి ఆడారి లచ్చ అప్పారావు, ఉపాధ్యక్షులు మొల్లేటి వీర కుమారస్వామి, వేగి సత్యనారాయణ, బొడ్డేటి అప్పారావు, మల్ల బలరాం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలి

- డీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పైడపునాయుడు


మాట్లాడుతున్న పైడపునాయుడు

విశాఖ విద్య : ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (టీడీఎఫ్) జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.పైడపునాయుడు కోరారు. సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆదివారం నగరంలోని క్వీన్‌మేరీ స్కూల్‌లో నిర్వహించారు. భవిష్యత్ కార్యాచరణపై కమిటీ బాధ్యులు సుదీర్ఘంగా చర్చించారు. సంఘాన్ని బలోపేతం చేసేందుకు నిర్ణయించారు. ఈ సందర్భంగా పైడపునాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు గుదిబండగా మారిన 117 జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల విలీన చర్యలతో తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. అనేక పాఠశాలలు మూతపడ్డాయని, వాటిని మళ్లీ తెరిచేలా కూటమి ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. జిల్లా కార్యదర్శి ఎ.ధర్మేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇంగ్లిష్ మీడియంను వెంటనే ఉపసంహరించాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు సంధ్యారాణి, కమిటీ సభ్యులు నానాజీరావు, రామతులసి, జోషి, శివ ప్రసాద్, జయలక్ష్మి, సంతోషి, నాగేశ్వరరావు, కృష్ణవేణి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో సీట్ల సంఖ్య పెంచాలి


ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

కంచరపాలెం: కంచరపాలెం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రం(ఐటీఐ)లో, ప్రభుత్వ ఐటీఐల్లో సీట్ల సంఖ్య పెంచాలని కోరుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. సమాఖ్య జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐ కళాశాల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సీట్ల సంఖ్య పెంచాలని, విద్యార్థుల నిష్పత్తికి తగినట్లు సీట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సరైన అవగాహన కల్పించకపోవడంతో ఆన్‌లైన్‌లో కళాశాలకు అప్లై చేసుకున్న సమయంలో ఒక్క కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐ కళాశాల మాత్రమే ఆప్షన్ చూపించడంతో అన్యాయం జరిగిందన్నారు.ఆడిషన్స్ పూర్తిస్థాయిలో ముగిసినప్పటికీ ఆదివారం ఉదయం 8గంటలకు రావాలంటూ మెసేజ్‌లు రావడంతో విద్యార్థులు కళాశాలకు చేరుకున్నారని, తీరా వచ్చిన తరువాత యాజమాన్యం స్పందించకపోవడంతో వారంతా సమాఖ్యకు ఫిర్యాదు చేశారన్నార. కళాశాల ప్రిన్సిపాల్ జె శ్రీకాంత్ అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లో మాట్లాడి విద్యార్థులకు ఇబ్బంది రాకుండా జిల్లాలో ఇతర ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సీట్లు వచ్చే విధంగా చొరవ తీసుకోవాలని కోరామన్నారు. న్యూ ఐటీఐ, నరవ, బాలికల ఐటీఐల్లో అర్హత కల్గిన విద్యార్థులకు సీట్లు ఇస్తామని ఆయన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎన్ శ్రీను, నాయకులు కిరణ్ గణేష్, దిలీప్, హేమనంద్, గ్రేస్ ప్రకాష్, తదతరులు పాల్గొన్నారు.